www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 30 జులై 2025

5

పశ్చిమ గోదావరి



ఏటిగట్ల పటిష్టతకు నిధులు మంజూరు

నరసాపురం : ఏటిగట్ల పటిష్టతకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కన్సర్వేన్సీ శాఖ ఎఇ జి.పవన్‌కుమార్ తెలిపారు. ఏటిగట్ల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. యలమంచిలి మండలంలోని అబ్బిరాజు పాలెం, గంగడపాలెం, లక్ష్మిపాలెం, చించినాడ, వైవేలంక, వాడవ ఏటిగట్ల ఎత్తును రెండు మీటర్ల ఎత్తు పెంచేందుకు ప్రభుత్వం రూ.9 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని వర్షాకాలం అనంతరం పనులు ప్రారంభిస్తామన్నారు. కాజ అవుట్ ఫాల్ స్లూయిజ్‌తో పాటు పలు స్లూయిజ్ నిర్మాణాలకు రూ.9.04 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్వే స్థానే వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.24 కోట్లు నిధులను మంజూరు చేస్తూ జీవో విడుదల చేసిందన్నారు. వీటితో పాటు కంచు స్తంభం పాలెం నుంచి బాడవ వరకు ఏటిగట్టుపై గ్రావెల్ రహదారి నిర్మాణానికి చేసిందన్నారు. రానున్న వృష్టరాల నేపథ్యంలో జిల్లాలో గోదావరిని అనుకుని 36 రేవుల నిర్మాణానికి రూ.59 కోట్లతో నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.

మధ్యాహ్న భోజనం ప్రయివేటు చెరలోకి..!

ఉంగుటూరు నియోజకవర్గంలో అమలుకు తహతహ

'మధురాన్నం' సంస్థకు కాంట్రాక్టు అప్పగించేందుకు సన్నాహాలు

తొలుత నియోజకవర్గంలోని దాదాపు 34 హైస్కూళ్లలో అమలుకు ప్రతిపాదనలు

మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొట్టేందుకు మరోసారి కుట్ర

గతంలోనూ ఇదేవిధంగా కుట్ర, జనం నుంచి తిరుగుబాటు రావడంతో వెనక్కి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ప్రభుత్వ స్కూళ్లలో ఎంతో విజయవంతంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉందా.. అందులో భాగంగానే ఉంగుటూరు నియోజకవర్గంలో మధ్యాహ్న భోజనం కాంట్రాక్టును 'మధురాన్నం' పేరుతో నిర్వహించే సంస్థకు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయా' అంటే అవుననే సమాధానం వస్తోంది. విద్యార్థులకు వేడివేడిగా భోజనం వడ్డిస్తూ ఆకలితీర్చే మధ్యాహ్న కార్మికుల పొట్టకొట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్కూళ్లు ఎన్నో ఏళ్లుగా విజయవంతంగా సాగుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రయివేటు ఆధ్వర్యంలోని 'మధురాన్నం' పేరుతో నడిపే సంస్థకు కాంట్రాక్టు అప్పగించాలని చూస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ దీనిపై ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించారని, త్వరలో అన్నిచోట్లా అమలు చేసే విధంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి వ్యవహారం చాపకింద నీరులా నడిచిపోతోంది. ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు దీన్ని ప్రత్యేక్షంగా పర్యవేక్షిస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవలే నియోజకవర్గంలోని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఉంగుటూరు నియోజకవర్గంలో ఉన్న దాదాపు 34 హైస్కూళ్లలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనాన్ని 'మధురాన్నం' సంస్థకు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై పలు హైస్కూళ్లలో తీర్మానాలు సైతం చేసినట్లు తెలుస్తోంది. దీంతో కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. ఏలూరు జిల్లాలో మొత్తం 1,749 ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతోంది. లక్షా ఆరు వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు వేడివేడిగా విద్యార్థులకు వండి వడ్డిస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి



విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.88, ఆరు నుంచి పది వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.8.57 చొప్పున మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఏలూరు జిల్లాలో 3,236 మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఈ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఎప్పటి నుంచో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించాలని ఆలోచనలు సాగుతున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో వెనక్కి తగ్గిన పరిస్థితి నెలకొంది. గత టిడిపి పాలనలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు అప్పగించాలని చూడడంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పశ్చిమగోదావరి జిల్లాలో 14,23 స్కూళ్లలో మధ్యాహ్న భోజనం నడుస్తుండగా, 80 వేల మందికిపైగా విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. గతంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించాలని ఆలోచనలో భాగంగా మధురాన్నం సంస్థ ఈ జిల్లాలో 56 స్కూళ్లలో అమలుచేసింది. తీవ్ర వ్యతిరేకత రావడంతో అక్కడితో ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ కుట్రలకు తెరతీసిన పరిస్థితి కనిపిస్తోంది. ముందుగా ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రారంభించి రెండు జిల్లాల్లోని అన్ని స్కూళ్లలో అమలు చేయాలన్న ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అన్నీ కుదిరితే వచ్చే ఆగస్టు నెల నుంచే అమల్లోకి తేవాలని చూస్తున్నట్లు సమాచారం. మధురాన్నం సంస్థ గతంలో వైసిపి నాయకుడు చెరుకువాడ రంగనాథరాజు ఆధ్వర్యంలో నడిచేది.

ప్రయివేటుకు అప్పగిస్తే తీరని నష్టం..

మధ్యాహ్న భోజనాన్ని ప్రయివేటుకు అప్పగిస్తే అన్ని విధాలా తీరని నష్టం జరుగుతుంది. ప్రతిరోజూ పిల్లల హాజరు బట్టి మధ్యాహ్న భోజన కార్మికులు వంట సిద్ధం చేసి పెడతారు. ఒక రోజు వంద మంది వస్తే, ఒక రోజు 150 మంది పిల్లలు ఉంటారు. విద్యార్థుల సంఖ్యను బట్టి వంట ఉంటుంది. ప్రయివేటుకు అప్పగిస్తే విద్యార్థుల హాజరు శాతం వారికి పట్టదు. స్కూల్లో చదివే మొత్తం విద్యార్థుల సంఖ్యను బట్టి భోజనం తెస్తారు. వర్షం కురవడం, వేరే కారణాలతో విద్యార్థులు తగ్గినా వండినదంతా పడేయాల్సిందే. సొమ్ము మాత్రం సంస్థకు చెల్లించాల్సిందే. దీంతో ప్రభుత్వానికి తీరని నష్టం జరగనుంది. అంతేకాకుండా ఏదో ఒక ప్రాంతంలో తెల్లవారు జామునే వంటలు చేసి స్కూళ్లకు సరఫరా చేస్తారు. విద్యార్థులు తినేసరికి వంటలు పాడైపోతాయి. గతంలోనూ ఇదే విధంగా జరిగింది. మరో వక్క వేలాది మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి దెబ్బతింటుంది. మధ్యాహ్న భోజన ప్రయివేటుకు అప్పగించడంలో ఉంగుటూరు ఎంఎల్ఎ ఎందుకు ఇంత తహతహలాడుతున్నారంటూ తీవ్రమైన చర్చ కొనసాగుతోంది.

ప్రజలందరూ అక్షరాస్యులు కావాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలోని ప్రజలందరూ అక్షరాస్యులు కావడానికి వయోజన విద్యాధికారులు అందరూ తమ, తమ స్థాయిల్లో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్ లిటరసీ ప్రోగ్రాంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రథమ స్థానంలో ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో ఇంకా నిరక్షరాస్యులు ఉండడం ఆవేదన కలిగిస్తోందన్నారు. జిల్లాలో రెండు లక్షల 30 వేల మంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. ముందుగా 15 నుంచి 59 సంవత్సరాల వయసున్న 69 వేల మందిని అక్షరాస్యులుగా చేయడానికి చేసే కృషిలో సఫలీకృతులు కావాలన్నారు. దానికి సంబంధించి ప్రత్యేకంగా సమయం కేటాయించుకోవాలన్నారు. 2029 నాటికి జిల్లాలో ప్రజలందరినీ అక్షరాస్యులను చేయాలన్నారు. నేడు సెల్‌ఫోన్లు వాట్సప్‌ల ద్వారా కూడా అనేక సమాచారాలు రావడం లావాదేవీలు జరగడంతో డిజిటల్ సేవలు కూడా వారు తెలుసుకుని వినియోగించుకునే విధంగా తయారు చేయాలన్నారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జిసిహెచ్.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ క్రియాత్మక విద్య, ఆధునిక పరికరాలు వినియోగించడానికి అవసరమయ్యే విద్య, తదితర విభాగాల కింద అక్షరాస్యులను చేస్తామన్నారు. ఎంపిడిఒ నూకల మురళీ గంగాధరరావు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఎడి సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, ఎండిఒలు, ఎంఇఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

నెల్లూరు పారిశుద్ధ్య కార్మికుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - తణుకు

నెల్లూరు కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులపై కూటమి ప్రభుత్వం లాఠీఛార్జీ, అక్రమ అరెస్టులు చేయడాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎన్.ఆదినారాయణ బాబు తీవ్రంగా ఖండించారు. మంగళవారం స్థానిక రాష్ట్రపతి రోడ్డు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, ఆదినారాయణ బాబు మాట్లాడుతూ గత 15 రోజులుగా నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్మికులకు ఉపయోగంగా ఉన్న ఆప్కాస్ రద్దు చేసి, అధికార కాంట్రాక్టర్లకు లాభాలు తెచ్చి, కార్మికులను రోడ్డున పడేసిందని విమర్శించారు. రాష్ట్రంలో మొదటిసారి నెల్లూరులో కాంట్రాక్టు విధానం తీసుకొచ్చి, పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడం అన్యాయమన్నారు. అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులు ఈ విధానం వల్ల రోజు వారీ కూలీలుగా మారుతారని పేర్కొన్నారు. కాంట్రాక్టు విధానాన్ని ఉపసంహరించుకోవాలని లేకుంటే మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు గార రంగారావు, శృంగవృక్షం శ్రీను, కాకి రమణ, మీసాల సురేష్, అర్జి రాధాకృష్ణ, గంద్రాపు శ్రీను, బంగారు నూకరాజు, వెంకటేశ్వరరావు, ఇ.సుధాకర్, టి.ప్రసాద్, టి. కృష్ణబాబు, రాణి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నేతలు

స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేసే వరకూ ఆందోళన

నేటి నుంచి మూడు రోజులపాటు స్మార్ట్ మీటర్ల దుష్ప్రభావంపై ప్రచార యాత్ర - ప్రజా సంఘాల ఐక్యవేదిక స్పష్టం

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలకు గుదిబండలా మారనున్న స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ప్రజాసమస్యల పరిష్కారానికి సమాజంలో నిరంతరం పోరాడుతున్న ప్రజా, కార్మిక సంఘాలు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను రద్దు చేయించాలనే ఉద్దేశంతో ప్రజా సంఘాల ఐక్య వేదికగా ఏర్పడి ఆందోళన బాటకు ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ, చేతి వృత్తుల సంఘం జిల్లా నాయకులు సీతారాం ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ రద్దు చేసే వరకూ ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రతినబూనారు. అలాగే స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే అనర్థాలపై రాబోయే రోజుల్లో చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలపై చర్చించి ప్రజా సంఘాల ఐక్యవేదిక కొన్ని నిర్ణయాలు చేసింది. స్మార్ట్ మీటర్లు - ప్రజలపై విద్యుత్ భారాల అంశంపై ప్రధానంగా చర్చించి కార్యాచరణ రూపొందించింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నపుడు వ్యతిరేకించిన స్మార్ట్ మీటర్లను ప్రస్తుతం బిగిస్తూ ప్రజలపై తీవ్ర భారాలు మోపుతోందన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకూ ప్రజలతో ఆందోళన చేస్తామన్నారు. దీనిలో భాగంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ మూడు రోజులపాటు భీమవరంలో స్మార్ట్ మీటర్ల దుష్ప్రబావాన్ని - ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను వివరిస్తూ ప్రచారయాత్ర నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 2న ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో స్మార్ట్ మీటర్లు - ప్రత్యామ్నాయం అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి పెద్ద ఎత్తున ప్రజానీకం తరలిరావాలని కోరారు. ఆగస్టు 5న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ప్రజానీకంతో ఆందోళన నిర్వహించేందుకు ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఎఐటియుసి జిల్లా నాయకులు కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక చేసిన కార్యాచరణలో పాల్గొంటామన్నారు. మరో బషీర్‌బాగ్ వంటి ఉద్యమాన్ని చేయడానికి కలిసి వస్తామన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు శ్రీనివాసరావు, ఎంసిపిఐయు నాయకులు గులివెల్లి రాంబాబు, ఎం.మహంకాళరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతి, అధ్యక్షులు బి.విజయ్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, పట్టణ ప్రజల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఎం.వైకుంఠరావు, బొక్కా సత్యనారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీను, రైతు సంఘం నాయకులు నాగిడి శాంతమూర్తి పాల్గొన్నారు.



భీమవరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్



పెంటపాడులో..

తాడేపల్లిగూడెం : విద్యుత్ ఛార్జీల నిలువు దోపిడీ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తొమ్మిదో రోజు క్రి సత్యవతి నగర్, మున్సిపల్‌కాలనీ, కుంచనపల్లి, ఏరియాలో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆలోచన చేస్తోందని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, బిగించిన తరువాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల పేరుతో భారాలు మోపడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపకపోతే దశలవారీ ఆందోళనలు చేపట్టి ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, నగిరెడ్డి సాయి, యడ్ల శ్రీను, కొమ్మిరెడ్డి ఉదయ్ కుమార్, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పెంటపాడు : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం ఆధ్వర్యాన పెంటపాడులో రెండో రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు వేయడం సరికాదని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బర్ల బాలాజీ, దత్తు రాము, తెర్లి రాజేష్ ఆడప ఆంజనేయులు, గాది వెంకటరావు, ఎస్‌విఎస్ రెడ్డి, మద్దాల పుత్రయ్య, బుద్దాల నాని పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. 1100 కాల్ సెంటర్‌కు అందిన అర్జీల నివేదికపై మంగళవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ సర్వే, పంచాయతీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్అండ్‌బి, విద్యుత్, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, సివిల్ సప్లయ్ శాఖల అధికారులతో జెసి సమీక్షించారు. పిజిఆర్ఎస్‌లో ప్రజలు పెట్టిన దరఖాస్తులు ఎంతవరకూ పరిష్కరించారు, క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఫిర్యాదుదారులను కలిసి సమస్యను అడిగి తెలుసుకుంటున్నారా లేదా అనే విషయంపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డిపిఒ ఎన్.రామనాథరెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాస్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి రఘునాథ బాబు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డిఎస్ఒఎన్.సరోజ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి

బ్యాంకర్లు రుణాలు అందించాలి

లబ్ధిదారుల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలి

రుణ మంజూరు లక్ష్యం తక్కువగా ఉండడంతో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆగ్రహం

భీమవరం : ప్రభుత్వ పథకాలకు బ్యాంకర్లు రుణాలు అందించి లబ్ధిదారుల ఆర్థిక పురోగతికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జిలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. లక్ష్యానికి చాలా తక్కువగా రుణాలు మంజూరు చేయడంతో కలెక్టర్ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిసిఆర్‌సి కార్డులు ఉన్న ప్రతి కౌలు రైతుకీ రుణాలు అందించాలని చెప్పారు. చేనేత కార్మికులు ముద్ర రుణాల మంజూరులో తాత్సారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పిఎంఎఫ్‌బివై ప్రీమియం జమలో నిర్లిప్తత ఎందుకు చూపిస్తున్నారని, రైతులు పంట నష్టపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం (బ్యాంకర్ల సమావేశం) జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 27,910 ఎస్‌హెచ్‌జిలు ఉండగా 26,471 ఎస్‌హెచ్‌జిలకు రూ.977.74 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. వీటిలో కేవలం 2,668 ఎస్‌హెచ్‌జిలకు రూ.144.85 కోట్లు మాత్రమే మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఆర్‌డిఎ ద్వారా పంపిన 9,633 ఎంసిపిలకు కూడా వెంటనే రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. చేనేత కార్మికులకు ముద్ర లోన్స్ మంజూరులో తీవ్ర జాప్యం ఎందుకని ప్రశ్నించారు. జిల్లాలో 253 మంది చేనేత కార్మికులకు రూ.1.11 కోట్లు మంజూరు చేయాలనేది లక్ష్యంగా కాగా కేవలం 13 దరఖాస్తులకు రూ.8.35 లక్షలు మాత్రమే మంజూరు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 83 దరఖాస్తులకు వెంటనే రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎల్‌వివిఆర్‌కె ఎంఎస్.మన్యం మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జి రుణాల మంజూరులో వేగం పెంచాలని, అలాగే పిఎం సూర్యఘర్ పథకం అమలు లక్ష్యానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం యూనియన్ బ్యాంక్ 2025-26 జిల్లా యాన్యువల్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎల్‌వివిఆర్‌కె ఎంఎస్.మన్యం, నాబార్డ్ ప్రతినిధి నిష్యంత్ చంద్ర, ఆర్‌బిఐ ప్రతినిధి రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.


బివి.ఆర్ కళాకేంద్రాన్ని పరిరక్షించాలి

ఖాళీ చేయాలంటే ప్రత్యామ్నాయం చూపాలి

అఖిల పక్షం డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


బివి.ఆర్ కళా కేంద్రం 19 సంవత్సరాలుగా పన్ను ఒకేసారి చెల్లించడం జరిగిందని, ఆరు దశాబ్దాలుగా ఉన్న కళా కేంద్రాన్ని ఖాళీ చేయించాలంటే ప్రత్యామ్నాయం చూపించాలని అఖిలపక్ష సమావేశంలో కోరారు. బివి.ఆర్ కళా కేంద్రం పరిరక్షణకై మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు మాట్లాడుతూ 65 ఏళ్ల చరిత్ర గల ఆఫీసర్స్ క్లబ్ 15/1961గా రిజిస్టర్ చేయబడి ఆనాటి జిల్లా కలెక్టర్ స్థలం మంజూరు చేయగా అప్పటి లో ఉన్నటువంటి తహశీల్దార్ సత్యనారాయణ రాజు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, స్టేట్ బ్యాంక్, ఆంధ్ర బ్యాంక్, మేనేజర్లు కార్యవర్గ సభ్యులుగా, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, వైట్ చాంబర్ షిప్ సభ్యులుగా రూ.501 చందా ఇస్తే 1961లో ఆ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. అప్పటి నుంచి సంఘ సేవా కార్యక్రమాలు, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు అభివృద్ధి చేయడం నృత్యం, సంగీతం, సాహిత్యం, కోర్సులను ఏర్పాటు చేయడం, వర్క్ షాపులను నిర్వహించడం, వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం, ప్రతినెల రూ.30 వేల నుండి లక్ష వరకు ఇబ్బంది పడుతున్న కళాకారులకు, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు, అంగవైకల్యం సంభవించిన వారికి, ప్రతి నెల తాడేపల్లిగూడెం దాతలు సహకారంతో ఆర్థిక సహాయ సహకారాలు చేస్తూ వస్తున్నామన్నారు. జాతీయస్థాయి నాటికలు, ఉత్సవాలు, గత 32 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఆ సందర్భంలోనే జాతీయస్థాయి పోటీలకు అనుగుణంగా ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో బివి.ఆర్ కళాకేంద్రం నాలుగు లక్షల 25 వేల సొంత ఖర్చులతో నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. ఇంత ప్రతిష్టాత్మకంగా జాతీయస్థాయి కేంద్ర ప్రభుత్వం నిధులు అర్హత కలిగిన బివిఆర్ కళా కేంద్రం ప్రభుత్వ నిధులు మంజూరు చేయడం, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా బివి.ఆర్ కళా కేంద్రాన్ని సత్కరించడం, అలాగే తిరుపతి ప్రపంచ కళా సభల్లో కూడా బిఆర్ కళాకేంద్రం పాల్గొనడం అత్యంత ఆనందదాయకమైన విషయం అన్నారు. బివి.ఆర్ కళా కేంద్రం సరిహద్దులో ఉన్న కోర్టుని పార్కింగ్ నిమిత్తం కళా కేంద్రం వెనుక ఉన్న సబ్ జైలు అర ఎకరం స్థలాన్ని పరిశీలించమని ఆర్‌డిఒకి, కమిషనర్‌కి, సభ్యులుగా ఉండి పరిశీలించమని కలెక్టర్ ఆదేశించడం జరిగిందన్నారు. సంస్థని తీసుకోమని ఎక్కడా చెప్పలేదన్నారు. బివి.ఆర్ కళా కేంద్రం 19 సంవత్సరాలుగా పన్ను ఒకేసారి చెల్లించడం జరిగిందన్నారు. ఆరు దశాబ్దాలుగా ఉన్న కళా కేంద్రాన్ని ఖాళీ చేయించాలంటే పత్యమ్నాయం చూపించాలన్నారు. కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి మార్నీడి బాబ్జి మాట్లాడుతూ కళాకారులకు బాసటగా నిలిచిన బివిఆర్ కళాకేంద్రంను పరిరక్షించాలని కమిషనర్‌ను హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు చింతకాయల బాబురావు మాట్లాడుతూ ఈ సంస్థలో కొన్ని వేల కళా ప్రదర్శనలు నిర్వహించి మంచి మన్ననలు పొందిన బివిఆర్ కళా కేంద్రాన్ని నిర్వీర్యం చేయడం తగదన్నారు. కళా కేంద్రం పరిరక్షణకు అఖిలపక్ష, పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బివి.ఆర్ కళా కేంద్రం అధ్యక్షులు, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి బుద్దాల వెంకటరామారావు, బివిఆర్ కళా కేంద్రం కార్యదర్శి ఎన్‌వి.రమణారావు, సిపిఎం నాయకులు చింతకాయల బాబురావు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అఖిలపక్షం సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

దళిత పేట శ్మశానం విస్తరించాలని వినతి

గణపవరం : అర్ధవరంలో మంగళవారం జరిగిన పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో గ్రామ ప్రధాన సమస్యగా ఉన్న దళిత పేట శ్మశాన వాటికను విస్తరించాలని, ఎస్‌సి కమ్యూనిటీ హాలు నిర్మాణం చేయాలని కోరుతూ ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నం చిన నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్ధవరం గ్రామాభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని చెప్పారు. శ్మశానం విస్తరణ విషయం అధికారులకి, ప్రజాప్రతినిధులకు పలుమార్లు చెప్పినా పరిష్కారం కాలేదని అన్నారు. గ్రామాల్లో ఉన్న మంచినీటి చెరువు చుట్టూ రాతి కట్టు కట్టాలని కోరారు. ఏప్రిల్ నెలలో జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రోడ్లు వెంటనే నిర్మాణం చేయాలని కోరారు. దీనికి ధర్మరాజు సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమం జల్లికాకినాడ, అప్పన్నపేట, ఎ.గోపవరం, ముగ్గళ్ల గ్రామాల్లో జరిగింది. ధర్మరాజు గ్రామాల్లో సమస్యలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. అనంతరం ముగ్గళ్ల సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొని ఛైర్మన్ గురుజు నాగసూర్య సత్యనారాయణని, సభ్యులు సూర్యచంద్రరావు, కొండవీటి సీతామహాలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్నివిరాంజనేయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వినతిని అందజేస్తున్న చిన నాగేశ్వరరావు

అప్పుల భారంలో మహిళలు

విధానాలకు పరిష్కారాలు చూపాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

నరసాపురం: అప్పుల భారం నుంచి మహిళలను విముక్తి చేయాలని, ప్రభుత్వ విధానాల అమలుకు పరిష్కారాలు చూపాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నరసాపురం పట్టణ మహాసభ వీరాస్మారక గ్రంథాలయంలో కోరాడి పార్వతి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ ఇటీవల మహిళల అప్పులకు సంబంధించి చేసిన సర్వేలు అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు అప్పుల విష వలయంలో చిక్కుకొని ప్రాణాలు కూడా కోల్పోతున్న పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వ బ్యాంకు నుంచి సక్రమంగా రుణాలు ఇవ్వనందున మైక్రో ఫైనాన్స్ సంస్థలు వడ్డీ వ్యాపారులపై ఆధారపడే పరిస్థితి పెరిగిందన్నారు. కనీసం మూడోవంతు బాధితులు రెండు, మూడు సంస్థల దగ్గర అప్పులు తీసుకుని అధిక వడ్డీ రేట్లు, సర్వీస్ ఛార్జీలు, జరిమానాలతో మూడు నుంచి పది రూపాయల వడ్డీలు కూడా చెల్లించే పరిస్థితిలోకి నెట్టబడుతున్నారన్నారు. రోజువారి కుటుంబ అవసరాల కోసం పనులు లేక అప్పులు చేయాల్సిన స్థితికి నెట్టబడుతున్నారన్నారు. వాటితో పాటు విద్యా, వైద్యం, అసంపూర్తిగా మిగిలిపోయిన ఇంటి నిర్మాణాలు, కుటుంబాలలో చేయవలసిన పెళ్లిళ్లు, చావులు, ఫంక్షన్లు, ఇంట్లో సమకూర్చుకోవలసిన వస్తువుల కోసం వీరితో పాటు కౌలు రైతులు, చిన్న వ్యాపారులు కూడా అప్పుల విష వలయంలో చిక్కుకున్నారన్నారు. వడ్డీ వ్యాపారస్తులు అప్పు ఇచ్చి చెల్లించకపోతే తీవ్రమైన ఒత్తిడితో వేధిస్తున్నారని ఆమె అన్నారు. ఈ దయనీయ పరిస్థితుల్లో మహిళలు ఎదుర్కొంటున్న తీవ్ర అప్పుల భారాన్ని బహిరంగ చర్చ చేసేందుకు, పరిష్కారం కోసం ఒత్తిడి చేసేందుకు మన రాష్ట్రంలో బహిరంగ విచారణ జరపాలన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షురాలుగా కౌరు లక్ష్మి, కార్యదర్శిగా కోరాడి పార్వతి, పట్టణ కమిటీ సభ్యులుగా కె.సుధా, ఝాన్సీ, లక్ష్మి దుర్గ, భవాని నూతన కమిటీగా ఎన్నికైయ్యారు.

రేపు ఉద్యాన కోర్సులకు తుది విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

హార్టీకల్చర్ డిప్లొమా, హార్టీకల్చర్(ల్యాండ్ స్కేపింగ్, నర్సరీ మేనేజ్ మెంట్) కోర్సులకు ఈనెల 31న తుది విడత మాన్యువల్ కౌన్సెలింగ్ వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు ఉద్యాన కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో 4 ప్రభుత్వ, మరో మూడు గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు స్వయంగా తగిన ధ్రువపత్రాలతో ఆరోజు కూడా దరఖాస్తు చేసుకొని కౌన్సెలింగ్‌కు హాజరు కావలసిందిగా పేర్కొన్నారు. ఇతర వివరాలకు, సీట్లు ఖాళీల వివరాల కోసం వెబ్‌సైట్ 'https://drysrhu.ap. gov. in' చూడగలరని తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు టిడిపి ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం మండలంలోని రామన్నపాలెం, కాళీపట్నం తూర్పు గ్రామాల్లో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లా నారాయణ విఠల్, జక్కంశెట్టి ఏడుకొండలు, కోపల్లి రాధాకృష్ణ, ఆకన సుబ్రమణ్యం, అడ్డాల బాబ్జీ, విప్పర్తి వెంకటేశ్వర్లు, నాగిడి రాంబాబు, పాల రాంబాబు, జక్కంశెట్టి చక్రపాణి, రేవు కృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి : ఎఒ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని నవరసపురం, మాధవాయిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అడబాల జ్యోతిక మాట్లాడుతూ వరిలో యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. రబీధాన్యం పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, కౌలు రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలని తద్వారా ప్రభుత్వం వారు ఇచ్చే పథకాలకు అర్హులు కాగలరన్నారు. అన్నదాత సుఖీభవ సంబంధించి బ్యాంక్ అకౌంట్‌నకు ఎన్‌పిసిఐ యాక్టివేట్ చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద సొంత రైతులు లోను పొందిన వారు రైతు సేవ కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్‌లో గాని ఎకరాకు రూ.210 చొప్పున బీమా చేయించుకోవాలన్నారు. రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జి విజయ హన్సు, మేడిది ఏసుపాదం, లోకం జగన్నాధం, యుగంధర్, రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ పిఎం శ్రీగా కడకట్ల సాంఘిక సంక్షేమ పాఠశాల

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాఠశాలలో కల్పించే మౌలిక సదుపాయాలు ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. జిల్లాలోని 26 పాఠశాలలను పరిశీలించిన అనంతరం కడకట్ల సాంఘిక సంక్షేమ పాఠశాలను జిల్లా ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేయడం జరిగిందని అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యామసుందర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎఐటీఓ ప్యానెల్ ద్వారా తిలకించారు. అనంతరం అధికారులు, విద్యార్థుల సమక్షంలో శిలా ఫలకం ఆవిష్కరించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల ఉత్తమ పియంశ్రీ పాఠశాలగా ఎన్నికవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా జాతికి అంకితం చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ.సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి వి.హనుమ, పేరెంట్స్ కమిటీ వైస్ ఛైర్మన్ ఇందిరా పాల్గొన్నారు.

మానవత మండల కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గణపవరం

మానవత మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘ భవనంలో జరిగింది. మండల నూతన కమిటీని ఛైర్మన్ కాకర్ల వినాయక ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా గంటా అన్నవరం, ఉపాధ్యక్షులుగా దండు బంగార్రాజు, కార్యదర్శిగా బోయిన సుబ్బారావు, కోశాధికారిగా బొద్దు శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సాగిరాజు జానకీ రామరాజు, పుప్పాల గోపి, బుద్దరాజు పుల్లయ్య, వంకాయల రామారావు, పాతపాటి హరికుమార్ రాజు, పి.ఆంజనేయులు, ఎస్.శంకరం సుబ్బారావు పాల్గొన్నారు.

రీ సర్వేలో లోపాలను సరిదిద్దండి

తహశీల్దార్‌కు రైతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల జరిగిన రీ సర్వేలోని లోపాలను సరిదిద్ది తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు మండల తహశీల్దార్ కావాలి నాగార్జునకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని మహదేవపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పలువురు రైతులు రీ సర్వేపై అభ్యంతరాలను తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పిఎంలు ఇవ్వడం వల్ల తమకు ప్రభుత్వం నుంచి రావలసిన రాయితీలు ఏమీ రావడం లేదని, వీటిని వెంటనే సరిదిద్దాలని కోరారు. కొంతమంది తమ పంట పొలాలు బీడు వారాయని వాటిని ఆక్వా చెరువులుగా మార్చేందుకు సహకరించాలని తహశీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి మురారి సుబ్బరాజు, టిడిపి సీనియర్ నాయకులు వేగేశ్న శివరామరాజు, గ్రామ రెవెన్యూ అధికారులు ఎస్.చిన్నారావు, ఎస్.శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

తూర్పుపాలెంలో బాబుష్యూరిటీ-మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - పోడూరు

తూర్పుపాలెం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పోడూరు, పెనుమంట్ర మండలం కన్వీనర్లు పిల్లి నాగన్న, గుడూరి దేవేంద్రుడు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు పోడూరు జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో కొన్ని హామీలు నెరవేర్చినా, మిగిలిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. వైసిపి నియోజకవర్గంలో నాయకులందరూ బాబు మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్, కూటమి ప్రభుత్వ పథకాలు అందడంలేదని ప్రజలకు నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఎంపిపి సత్యేశ్ సమగంగికే సాగర్, కర్రి వెంకటనారాయణ రెడ్డి(వాసు), కర్రి వేణుబాబు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

రూ.74 వేల విలువైన మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అక్రమంగా మద్యాన్ని యానం నుండి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.74 వేల విలువైన మద్యం బాటిళ్లను భీమవరం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభు కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానంకి చెందిన మీసాల మని కంఠేశ్వరావు, భీమవరానికి చెందిన బొక్క శ్రీనివాస్ మద్యం అక్రమ రవాణా చేసినట్టు తెలిపారు. నిందితుల వద్ద నుండి మద్యం 1443 ఎంఎల్ బాటిళ్ళు, 181 బీర్ బాటిల్స్, 38 బ్రీజర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ కె.బలరామారావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని పెనుమంచిలి గ్రామానికి చెందిన పార్ని చిన్న సత్యనారాయణ కుమార్తె డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నది. యువతి పెనుమంచిలి నుండి ఈనెల 28వ తేదీ ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పార్ని చిన్న సత్యనారాయణ 29వ తేదీ మంగళవారం ఆచంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు సిసి పుటేజీను పరిశీలించగా స్థానిక రామేశ్వర స్వామి ఆలయం వద్ద నుండి ఆటో ఎక్కి వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

గజానికో గుంత.. ప్రజలు చింత..!

జిల్లాలో ఎక్కడ చూసినా దెబ్బతిన్న రోడ్లే దర్శనమిస్తున్నాయి. కంకర తేలి, గుంతలు పడి, సిమెంటు లేచిన రహదారులతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం గుంతలన్నీ పూడ్చేస్తాం, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీలు గుప్పించింది. ఆచరణలో మాత్రం ఏ రహదారి చూసినా ఏమున్నది గర్వకారణం అన్న చందంగా మారింది. అధ్వానంగా ఉన్న రహదారులతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షం వస్తే చాలు గుంతల్లో నీరు చేరి మడుగులను తలపిస్తున్నాయి. అధ్వానమైన రహదారిలో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రయాణికులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

వెలివర్రు-మహాదేవపట్నం రహదారి ధ్వంసం


అధ్వానంగా ఉన్న రహదారి

ఉండి: మండలంలోని వెలివర్రు-మహదేవపట్నం వెళ్లే రహదారిని పునర్నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వెలివర్రు నుంచి మహదేవపట్నం వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. గత కొన్ని సంవత్సరాలుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న ఇంతవరకు ఆ రహదారికి మరమ్మత్తులు కూడా చేయలేదని రెండు గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెలివర్రు, పేరంటాలమ్మ అమ్మవారి ఆలయం నుంచి మహదేవపట్నం పరిధి రామచంద్రపురం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి మొత్తం గుంతలు గుంతలుగా ఉండి ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఆ రహదారిలో ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని, ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతింటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వచ్చాయంటే రహదారి మొత్తం చెరువులాగా తయారవుతుందని, ప్రయాణించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులైనా చేపట్టాలని వారు కోరారు. ఇటీవల వెలివర్రు గ్రామ మాజీ సర్పంచి పొత్తూరి వెంకటేశ్వరరాజు తన సొంత నిధులతో పేరంటాలమ్మ ఆలయం వద్ద నుంచి గరువు శివారు వరకు రహదారి నిర్మించారని, మిగిలిన రహదారి వేయడంలో అధికారులు శ్రద్ధ చూపించడం లేదన్నారు. గత సంవత్సరం పంచాయతీరాజ్ జెఇ క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తున్నామని, త్వరలోనే రహదారి పునర్నిర్మిస్తామని చెప్పినప్పటికీ అది ఆచరణలోకి రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతికి రహదారులన్నీ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తామని, అవసరమైన చోట పునర్నిర్మిస్తామని ప్రచారం చేసినప్పటికీ అది ఆచరణలోకి రాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెలివర్రు, మహదేవపట్నం గ్రామాలకు వెళ్లే రహదారిని అభివృద్ధి పరచాలని వారు కోరారు.

ఆ దారిలో వెళ్లాలంటే..


గుంతల్లో నీరు చేరి అధ్వానమైన రహదారి

ఆచంట : ఆ రహదారిలో నడిచి వెళ్లాలన్న నరకమే కనిపిస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో మోటార్ సైకిళ్లు, సైకిల్‌తో కొందరు నిత్యం పడుతూ లేస్తూ ప్రయాణాలు చేస్తున్నారు. అయితే దశాబ్దాల కాలంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదు. ఆచంట కచేరి సెంటర్ నుంచి ఆచంట వేమవరం వెళ్లే ప్రధాన రహదారి సుమారు మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఈ తరహాలో ఈ రహదారి ఆచంట కచేరి సెంటర్ నుంచి సుమారు 300 మీటర్లలో పలుచోట్ల చిద్రమైపోయింది. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా గోతులు యధాతథంగా పడుతూనే ఉన్నాయి. ఈ రహదారి ఆచంట, ఆచంట వేమవరం, గుమ్మలూరు, పెనుమదం, వయా పాలకొల్లులో కలుస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారి అక్రమాలకు గురై విస్తరణకు నోచుకోక ప్రజలకు నరకం చూపిస్తుంది. కూటమి ప్రభుత్వంలో రూ.150 కోట్లు రహదారుల గోతులు పూడ్చి మరమ్మతులు నిమిత్తం మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ రహదారికి విధులు మంజూరు కావడంతో ఈ రహదారికి సంబంధించిన కాంట్రాక్టర్ ఐరన్, సిమెంట్ గ్రావెల్ తెచ్చి రహదారి వేయటానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఈ రహదారి 12 మీటర్లు ఉండవలసి ఉండగా ఒకచోట ఏడు మీటర్లు, మరోచోట నాలుగు మీటర్లు, మరోచోట మూడు మీటర్లు రావడంతో సీసీ రహదారి నిర్మించలేని పరిస్థితి ఏర్పడడంతో తెచ్చిన మెటీరియల్‌ను కాంట్రాక్టర్ వెనుకకు తీసుకెళ్లిపోయారు. దీంతో ప్రజల్లో నిరాశ నెలకొంది. తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో, చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగించి ప్రజలకు సీసీ రహదారి నిర్మించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అధ్వానంగా కాళీపట్నం, వెంప రహదారులు


రాళ్లు పైకి తేలి ధ్వంసమైన రహదారి

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. దీంతో గ్రామాల నుంచి జిల్లా కేంద్రం, ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళీపట్నం నుంచి దెయ్యాల తిప్ప, యనమదుర్రు మీదుగా భీమవరం వెళ్లే రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. రహదారిపై గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిని పునర్నిర్మాణం చేయవలసి ఉంది. గతంలో మరమ్మతులు చేసి వదిలేశారు. దీంతో అది తిరిగి యథాస్థితికి చేరుకునే ప్రమాదం ఏర్పడింది. మండల కేంద్రం మొగల్తూరు నుంచి కొత్తపాలెం మీదుగా భీమవరం గ్రామీణ మండల ప్రధాన రహదారి ధ్వంసమైంది. గతంలో రహదారి నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.13 కోట్ల నిధులు మంజూరు చేసింది. బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో ఆ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు వెళ్లే సమయంలో రహదారిపైన దుమ్ము భారీగా లేవడంతో వెనక వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వచ్చిన సమయంలో రహదారి మడుగును తలపిస్తుంది. ఈ రహదారులపైనే మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భీమవరం వెళ్లి వస్తూ ఉంటారు. దీంతో రహదారి పునర్నిర్మించాలని ప్రయాణికులు వేడుకొంటున్నారు.

అధ్వానంగా పాలమూరు-పాదలాడ రోడ్డు..


రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


పెనుమంట్ర: మండలంలోని పాలమూరు నుంచి ఇరగవరం మండలంలోని పొదలాడ వరకు ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు అధ్వానంగా ఉన్నందును ఈ మార్గంలో ప్రయాణం కష్టమైందని స్థానికులు వాపోయారు. ఇటీవల ఈ రోడ్డులో నాగళ్లదిబ్బ నుంచి పొలమూరు పాఠశాలలో స్కూల్ ఏజ్ చిల్డ్రన్స్ డ్రైవ్‌లో విద్యార్థులను, పేరెంట్స్‌ను కలవడం కోసం వెళ్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు బండి జారి కింద పడ్డారు. కాగా ఈ ప్రమాదంలో ఒకరికి చెయ్యి విరిగి మెడికల్ సెలవులోకి వెళ్లగా, ఒకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొలమూరు-పొదలాడ రోడ్డు మరమ్మతులకు కూటమి ప్రభుత్వం సుమారు నలభై లక్షల రూపాయలు మంజూరు చేసిందని తెలిసిందని, అయితే ఇక్కడ పనులు అరకొరగా చేయడం జరిగిందన్నారు. పొలమూరు నుంచి నాగళ్లదిబ్బ వరకు ప్యాచ్ చేసి నాగళ్లదిబ్బ నుంచి చెన్నాడ చెరువు వరకూ ప్యాచ్ వర్క్ చేయలేదని, చెన్నాడ చెరువు నుంచి బ్రాహ్మణ చెరువు వరకూ ప్యాచ్ వర్క్ చేశారన్నారు. మధ్యలో చెన్నాడ చెరువు మాత్రమే వదిలేసారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడి నుంచి సుమారు 15 మంది పిల్లలు పొలమూరు స్కూల్‌కి వెళుతున్నారని, చాలా ఇబ్బంది పడుతున్నారని, ఇక్కడి ప్రజలు, రైతులు పొలమూరు, నౌడూరు ప్రయాణం చేస్తారు వాళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ రోడ్డు విషయంపై ఆర్అండ్‌బి అధికారులను అడిగితే గ్రాంట్ సరిపోలేదంటున్నారని ఆరోపించారు. ఈమధ్యనే రొయ్యల చెరువుల రైతులు మట్టి రోడ్డు మీద వదిలేసి, కనీసం ఆ మట్టి తొలగించడం లేదని, ఈవిషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు : ఈ రోడ్డు పరిస్థితి, ప్రజల అవస్థలు పట్ల సోమవారం నిర్వహించు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జిల్లా కలెక్టర్‌కి స్థానికులు పలువురు వినతి పత్రం అందించి, పరిస్థితులు వివరించినట్లు వారు తెలిపారు.

పలు గ్రామాల్లోని రోడ్లు తీవ్రంగా పాడై అధ్వానంగా ఉన్నాయి. అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో ప్రయాణికుల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని సత్యవరం, కొయ్యేటి పాడు, జుత్తిగ, నత్తా రామేశ్వరం, వెలగలవారి పాలెం రోడ్లు చాలా భాగం పాడయ్యాయని వారు పేర్కొన్నారు. కొన్ని చోట్ల ప్రధాన రోడ్లు, పుంత దారులు సైతం పాడై పోయాయని, ఇటీవల తాత్కాలిక రిపేర్లు చేసిన రోడ్లు తిరిగి పూర్వ స్థితికి వచ్చాయని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్లు బాగుచేయించాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి : జెసి

భీమవరం : పేదరికం లేని సమాజ నిర్మాణానికి తమ వంతు సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. పి4లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్లో జిల్లాలోని సంపన్న రైతులు, ఎరువులు, పురుగు మందుల షాపుల యజమానులు, డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి జెసి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలోని పేద తరగతుల వారిని ఆర్థికంగా, సామజికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పి4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూతనిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. సమాజం ద్వారా సంపన్నులుగా ఎదిగిన వారు పేదలను ఆదుకోవడం ద్వారా సమాజ సేవ చేసిన వారు అవుతారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండేవిధంగా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, వ్యవసాయ రంగం నుండి పెద్ద ఎత్తున మార్గదర్శకులుగా నమోదై బంగారు కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఒ కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ పితాని

రైతు సంక్షేమానికి కృషి చేయాలి : ఎంఎల్ఎ

పెనుగొండ : సొసైటీ కార్యకలాపాలను పారదర్శంగా రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని నూతన పాలకవర్గ సభ్యులు కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం పెనుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పితాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ స్పెషలాఫీసర్ ఎంఎం షరీఫ్ ఛైర్మన్‌గా నక్క వేద వ్యాస శాస్త్రి, సభ్యులుగా వేండ్ర మురళీ, కానూరు సత్యనారాయణ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ పితాని మాట్లాడుతూ సొసైటీ నుంచి నూతనంగా ఎన్నికైన సభ్యులు రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ బ్యాంకును జిల్లాలోనే ఉత్తమ సొసైటీగా తీర్చిదిద్ది అభివృద్ధి చేయాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, నిలవ మార్కెటింగ్ సహకారం, సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన పెంపు వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ చేపడతామని, రైతులకు అవినీతి లేని పాలన అందిస్తామని ఈ సందర్భంగా సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సరోగసి కేంద్రాలు నిబంధనలు పాటించాలి


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి

భీమవరం : జిల్లాలో ఉన్న సరోగసి కేంద్రాలు నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. భీమవరంలో సరోగసి కేంద్రాల తనిఖీలలో భాగంగా గిఫ్ట్ ఫెర్టిలిటీ, మదరెస్ ఫెర్టిలిటీ కేంద్రాలను తనిఖీ చేశారు. క్లీనిక్ నిర్వహణకు ఏర్పాటు చేసిన వివిధ విభాగాలు పరిశీలించడం జరిగింది. గర్భిణులకు నిర్వహించే స్కానింగ్ నిర్వహణ, అనుమతులు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడారు. జిల్లాలో అన్ని కేంద్రాలు నిబంధనలు పాటిస్తూ వాటికి లోబడి కేంద్రాలు నిర్వహించాలని తెలిపారు.

రైతు సంక్షేమమే సహకార సంఘం ధ్యేయం

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట


ప్రమాణం చేస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయమని ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట మృత్యుంజయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు చిలుకూరి సీతారామ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా కడలి భాస్కరరావు, సభ్యులుగా బలుసు శ్రీరామమూర్తి, తోరం ప్రసాదులచే సొసైటీ స్పెషలాఫీసర్ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సభ్యులు బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పితాని మాట్లాడుతూ ఆచంట సొసైటీ ద్వారా ఏర్పాటు చేసే పెట్రోల్ బంకుకు సహకరిస్తానని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా రైతులకు ఉన్నతమైన సేవలు అందించడం ద్వారా అభివృద్ధి పథంలో నడిపించడానికి త్రిసభ్య కమిటీ సభ్యులు తన వంతు కృషిచేయాలని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయడానికి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని తెలిపారు. 108 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ సొసైటీ సుమారు రూ.50 లక్షల ఆదాయంతో రైతులకు సేవలో ముందుందన్నారు. 2,253 మంది సభ్యులతో రూ.1.04 లక్షలతో ఉందన్నారు. ఈ సొసైటీ రూ.41 కోట్ల బిజినెస్ టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. రైతులకు క్రాప్ లోన్స్ రూ.8 కోట్లు, గోల్డ్ లోన్స్ రూ.4 కోట్లు, ఎరువుల వ్యాపారం రూ.1.25 కోట్లు, రైతులకు ఓడియల్ అప్పులు రూ.13.96 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. సొసైటీ సంఘ సభ్యులు డిపాజిట్ రూ.17 కోట్లు, డిసిసిబి డిపాజిట్ రూ.8 కోట్లు ఉన్నట్లు తెలిపారు. డిసిసిబి ద్వారా రూ.8 కోట్ల 20 లక్షల అప్పులు క్రాప్ లోన్స్ తీసుకున్నట్లు వెల్లడించారు. సంఘ సభ్యులందరూ రూ.250 చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శి వేండ్ర విష్ణు మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘాల ఛైర్మన్‌లు తమ్మినీడి ప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ, నేతలు కేతా మీరయ్య, బీర నరసింహమూర్తి, జవ్వాది బాలాజీ శ్రీనివాస్, నంబూరు విజయ్, దాసిరెడ్డి పుణ్యావతి, కేతా మురళీ, మానేపల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ కృష్ణమోహన్, మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

మహోన్నత సాహితీ శిఖరం సినారె

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి మాట్లాడుతూ సినారె ఒక వ్యక్తి కాదని సామూహిక శక్తితో కూడిన సాహితీ మహోన్నత శిఖరమన్నారు. తెలుగు సాహిత్యం ద్వారా సమాజంలో మానవతా విలువలు నెలకొల్పటానికి తాపత్రయపడిన మహనీయుడని, నిత్యం కవితాక్షరాలతో తెలుగు తల్లి మెడలో కావ్యహారాలను అలంకరించారని, సాహిత్య వనంలో సుగంధ భరిత పరిమళాలు వెదజల్లిన సాహితీ కృషీవలుడన్నారు. వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ మాట్లాడుతూ సినారె కేవలం సాహిత్యానికి పరిమితం కాలేదని అటు పరిపాలనలోనూ ఇటు చలన చిత్ర రంగంలోనూ విశేషమైన ప్రతిభ కలవారన్నారు. ఆయన విశ్వంభర కావ్యం సాహిత్యానికి మణిదీపిక వంటిదన్నారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి మాట్లాడుతూ సాహిత్యం పరిధి విస్తృతమైందని, కవులు కూడా విస్తృతమైన వారేనన్నారు. ఆయన దాదాపు 80 రచనలు చేసారని, ఆయన స్పృజించని సాహిత్య ప్రక్రియ తెలుగులో లేదంటే ఆయన గొప్పదనం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చునన్నారు. పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, వచన కవితలు, గద్యకృతులు, చలనచిత్ర గీతాలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు, ముక్తక కావ్యాలు, బుర్ర కథలు, గజళ్లు, వ్యాసాలు, విమర్శన గ్రంథాలు, అనువాదాల వంటి ప్రక్రియలలో రచనలు చేసి ఎన్నో అవార్డులు అందుకున్న సినారె తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక అభ్యుదయానికి వారధి వంటివారన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.యామిని, జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

పెనుగొండ మాజీ ఎఎంసి ఛైర్మన్ గోపాలకృష్ణ మృతి

పెనుమంట్ర : మండలంలోని మల్లిపూడికి చెందిన న్యాయవాది, మాజీ పెనుగొండ ఎఎంసి ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ(60) మంగళవారం అనారోగ్యం వల్ల విశాఖపట్నంలో మృతి చెందారు. గతంలో ఆయన టిడిపి తరుపున ఎంపిటిసిగా, రాష్ట్ర బిసి సంఘంలో పలు పదవులు నిర్వహించారు. వీరి భార్య వీరలక్ష్మి స్థానిక మండలంలో ప్రభుత్వ టీచర్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గోపాలకృష్ణ ఆకస్మిక మృతి పట్ల మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, మండలంలోని టిడిపి నాయకులు వెలగల బుల్లి రామిరెడ్డి, జి.మురళీ, చింతపల్లి రామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఇక్కడ ఆయన అంత్యక్రియలు జరుగనున్నాయి.

అభివృద్ధి చేయడం మోసమా : ఎంపిపి

వీరవాసరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేస్తుంటే అది మోసమా అంటూ వైసిపిని ఉద్దేశిస్తూ ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని చంద్రశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి శ్రేణులు చేస్తున్న దుష్ప్రచారాన్ని మంగళవారం ఖండించారు. వైసిపి ప్రచారం చేస్తున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అంటూ వారు ప్రజల్లోకి వెళితే వారిపై ప్రజలే తిరగబడే రోజులు వస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో వీరవల్లి చంద్రశేఖర్, ఆదిరెడ్డి గంగారావు, స్టాలిన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన

ఉండి: ధూమపానం, మాదకద్రవ్యాలు సేవించడం వల్ల విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురవుతారని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.జగదీశ్వర్ రావు అన్నారు. మంగళవారం ఉండి శ్రీశశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో స్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు అధ్యక్షతన ధూమపానం, మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, చిల్డ్రన్ సేఫ్టీ, శక్తి యాప్ వినియోగంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న వి.జగదీశ్వర్ రావు, ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ చెడు స్నేహాల వల్ల ధూమపానం, మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్ వినియోగించాలని, దీనివల్ల ఆపదలో ఉన్నప్పుడు పోలీసులకు సందేశం వచ్చి రక్షించేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

గణపవరం: మండలంలోని పిఎంపి అసోషియేషన్ ఆధ్వర్యాన మంగళవారం డెంగీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు మాట్లాడుతూ దోమల నివారణతో డెంగీ వ్యాధిని నివారించవచ్చునని చెప్పారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. ఒంటిపై దద్దుర్లు, జ్వరం, ఒళ్లునొప్పులు వంటివి ఉంటే పిహెచ్‌సికి వెళ్లి వైద్యం పొందాలని చెప్పారు. కార్యదర్శి శివశ్రీనివాస్, గణపవరం, నిడమర్రు సభ్యులు పాల్గొన్నారు.